ప్రజాశక్తి
మంగళవారం 17 జనవరి 2023
5
శ్రీకాకుళం

సంగమేశ్వర కొండకు పోటెత్తిన యాత్రికులు

కనుమవిందు

మద్యం దుకాణం వద్ద బారులు తీరిన మందుబాబులు

- తగ్గిన మాంసాహార విక్రయాలు
- రికార్డు స్థాయిలో మద్యం అమ్మకాలు
- సినిమా థియేటర్ల వద్ద రద్దీ

ప్రజాశక్తి - శ్రీకాకుళం, శ్రీకాకుళం అర్బన్

జిల్లావ్యాప్తంగా సంక్రాంతి, కనుమ పండుగను ప్రజలు కోలాహలంగా జరుపుకున్నారు. అయితే కనుమ సోమవారం కావడంతో చాలా మంది మాంసాహార ప్రియులు ఆదివారమే లాగించేశారు. సోమవారం 60శాతం మంది మాంసాహారానికి దూరంగా ఉన్నారు. దీంతో మాంసం విక్రయాలు తగ్గినా.. మందుబాబుల జోరు పెరిగింది. జిల్లాలోని పలు మండలాల్లో టివి సీరియల్, జబర్దస్త్ కార్యక్రమాల నటులతో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

కనుమ రోజు మాంసం విక్రయాలు గతేడాది కంటే ఈ ఏడాది కొంత తగ్గాయి. ఉదయం నుంచే మాంసం దుకాణాల వద్ద రద్దీ కనిపించాల్సి ఉండగా.. ఆ ఛాయలే కానరాలేదు. కనుమ పండగను పురస్కరించుకుని మాంసం కొనుగోళ్లకు డిమాండ్ ఉండడంతో వ్యాపారులు ధరలను పెంచేశారు. కిలో మటన్ సంక్రాంతికి ముందు రూ.800 ఉండగా కనుమ రోజు రూ.1000కు విక్రయించారు. కోడి మాంసం శుక్రవారం కిలో రూ.225 ఉండగా, సోమవారం రూ.230కు విక్రయించారు.

రికార్డు స్థాయిలో మద్యం అమ్మకాలు

సంక్రాంతి వచ్చిందంటే మందుబాబులకు పండుగే. భోగి, సంక్రాంతి, కనుమ పర్వదినాల్లో జిల్లాలో మద్యం ఏరులై పారింది. ప్రభుత్వ మద్యం దుకాణాలతో పాటు బార్లకూ డిమాండ్ బాగా పెరిగింది. జిల్లాలో 186 మద్యం దుకాణాలు, 26 బార్లు ఉన్నాయి. మూడు హోల్‌సేల్ దుకాణాలున్నాయి. వీటి ద్వారా బార్లు, మద్యం దుకాణాల్లో పలురకాల బ్రాండ్లు లభ్యం కాకపోయినా, రికార్డు స్థాయిలో మద్యం అమ్మకాలు జరిగాయి. ఈ మూడు రోజుల్లో సుమారు రూ.16 కోట్ల మద్యం విక్రయాలు జరిగినట్లు ఎక్సైజ్‌శాఖ అధికారులు తెలిపారు. భోగి రోజున రూ.4.19 కోట్ల మేర మద్యం విక్రయాలు కాగా, సంక్రాంతి రోజున రూ.5.69 కోట్లు, కనుమ రోజున సాయంత్రం వరకు సుమారు రూ.5.08 కోట్ల మేర మద్యం విక్రయాలు జరిగాయి. సోమవారం రాత్రి, ముక్కనుమ మంగళవారం రోజు భారీగా విక్రయాలు జరిగే అవకాశముంది. గతేడాది పండుగ మూడు రోజుల్లో రూ.13 కోట్ల మేర విక్రయాలు కాగా, ఇప్పటివరకు సుమారు రూ.16కోట్ల విక్రయాలు జరిగాయని అధికారుల అంచనా.

ప్రభుత్వం మద్యం దుకాణాలతో పాటు బారులపై

మాంసం దుకాణం వద్ద రద్దీ

ఆబ్కారీ శాఖ, ఎస్ఇబి, పోలీసు శాఖలు కినుక వహించాయి. దీంతో పెద్ద ఎత్తున మద్యం అందుబాటులోకి వచ్చింది. దుకాణాల్లోనూ బ్యాక్‌డోర్ అమ్మకాలే అధికం కావడం వల్ల ఎవరికైనా మందు అందుబాటులోకి వచ్చింది. గ్రామాల్లో మద్యం ఏరులై పారింది. ఫలితంగా బార్లు, డాబా హోటళ్లు వద్ద పెద్దఎత్తున మద్యం అమ్మకాలు సాగాయి. గత ఏడాదికి మించి ఈ ఏడాది మద్యం అమ్మకాలు జరిపారు. దీంతో ఆబ్కారీ శాఖ లక్ష్యాలు నెరవేర్చుకునేందుకు, ప్రభుత్వానికి భారీగానే ఆదాయం సమకూర్చుకునేందుకు సంక్రాంతి సంబరాలు జరుపుకునేలా ఆబ్కారీశాఖ కిక్ ఇచ్చింది. మరో రెండు మూడు రోజులపాటు అమ్మకాలు ఇదే స్థాయిలో కొనసాగుతాయని అంచనా వేస్తున్నారు.

ఒడిశా మందుతో సరిహద్దుల్లో సందడి

ఒడిశాలో నాణ్యమైన మద్యం తక్కువ ధరకు విక్రయిస్తుండడంతో జిల్లాలో అనేక సరిహద్దు ప్రాంతాల నుంచి ఒడిశా మందు కోసం క్యూ కట్టారు. వాహనాల్లో గ్రామాలకు తెచ్చుకున్న వారు కొందరైతే మరి కొందరు ఏకంగా అక్కడికి వెళ్లి తాగి వారికి మద్యం ఆదాయాన్ని సమకూర్చి పెట్టారు. ఇచ్ఛాపురం మొదలు, పాతపట్నం వరకు అనేక గ్రామాల్లో ఒడిశా మద్యం పండగ పూట విచ్చలవిడిగా అమ్మేశారు.

తీర్థాల వద్ద కోలాహలం

జిల్లాలోని తీర్థాల వద్ద యాత్రికుల కోలాహలం కనిపించింది. మందస మండలం రట్టి వల్లభనారాయణస్వామి జాతర, జి.సిగడాం మెట్టవలస వద్ద మల్లిఖార్జునస్వామి జాతర, ఆమదాలవలసలోని గాజులకొల్లివలస వద్ద సంగమేశ్వరుని జాతర, శ్రీముఖలింగంలోని పద్మనాభ జాతరను నిర్వహించారు. వీటికి వేలాదిగా యాత్రికులు తరలివచ్చి ఆనందంగా గడిపారు.

సినిమా థియేటర్ల వద్ద సందడి

సంక్రాంతి పండగ అంటేనే సినిమా థియేటర్ల వద్ద సందడి. బాలకృష్ణ, చిరంజీవి సినిమాలు సంక్రాంతి బరిలో నిలవడంతో థియేటర్లు హౌస్‌ఫుల్ బోర్డులు పెట్టేశాయి. కుటుంబాలతో పాటు సినిమాలకు వెళ్లారు. జిల్లాలోని పలు మండలాల్లో డాన్స్‌లు, నాటికలు, బుర్రకథలు వంటి సాంస్కృతిక కార్యక్రమాలకు ప్రాధాన్యం ఇచ్చారు. పలు ప్రాంతాల్లో నాటకాలు ప్రదర్శించారు.

జాతరలో పోటెత్తిన జనం

- సంగమేశ్వర కొండ, డేకురు కొండకు తరలివచ్చిన ప్రజలు
- స్తంభించిన ట్రాఫిక్

ప్రజాశక్తి - ఆమదాలవలస

ఆమదాలవలస మండలంలోని గాజులకొల్లివలస వద్ద ఉన్న సంగమయ్య కొండ వద్ద సంక్రాంతి మూడు రోజుల పాటు నిర్వహించే యాత్రకు యాత్రికులు పోటెత్తారు. కనుమ రోజు వేలాది మంది యాత్రికులు కొండపై ఉన్న శివాలయ దర్శనానికి బారులు తీరారు. మూడు రోజుల పాటు నిర్వహించే ఈ యాత్రకు పరిసర గ్రామాల నుంచే కాకుండా ఒడిశా, ఇతర జిల్లాల నుంచి యాత్రికులు వచ్చారు. సంగమేశ్వర స్వామి కొండకు వెళ్లే రహదారి నాలుగు వైపులా జనాలతో కిక్కిరిసిపోయింది. కొండపై గృహలో ఉన్న సంగమేశ్వర స్వామిని దర్శించుకోవడానికి యాత్రికులు ఇక్కట్లకు గురయ్యారు. కొండపై నుండి దిగువ వరకు మెట్లు పైనే జనాలు పడిగాపులు కాశారు. వారిని నియంత్రించడానికి పోలీసులు శతవిధాలా ప్రయత్నించినప్పటికీ భారీ జన సందోహంతో వీలుపడలేదు. యువత కేరింతలు కొడుతూ హంగామా చేశారు. మహిళలు, పెద్దలు అధిక సంఖ్యలో పాల్గొని సంగమేశ్వర స్వామిని దర్శించుకుని యాత్రలో పాల్గొన్నారు. చిన్నారులు జెయింట్ వీల్, రంగులరాట్నం, తదితర వినోద కార్యక్రమాల్లో పాల్గొని ఆనందంగా గడిపారు. బత్తిలి-అలికాం మెయిన్ రోడ్డు ట్రాఫిక్‌తో సుమారు అరగంట సేపు ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపోయాయి. పోలీసులు రంగ ప్రవేశం చేసి ట్రాఫిక్‌ను క్లియర్ చేయడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. యాత్రకు క్రమేపి పెరుగుతున్నారని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. పోలీసులు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తుగా పటిష్టమైన భద్రతను ఏర్పాటు చేశారు. బందోబస్తు ఏర్పాట్లలో ఎస్ఐ ఆజాద్, ఎఎస్ఐ లక్ష్మి, పోలీసు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాకుళం అర్బన్: మండలంలోని పెదపాడులోని అప్పనమ్మ జాతర సోమవారం ఘనంగా జరిగింది. 1972 నుంచి సంక్రాంతి మరుసటి రోజైన కనుమ నాడు జాతర నిర్వహిస్తూ ఉన్నారు. పెద్ద ఎత్తున యాత్రికులు ముర్రాటలతో ఆలయం వద్దకు చేరుకున్నారు. ఈ జాతరకు ఇతర జిల్లాలైన విశాఖపట్నం, శ్రీకాకుళం నుంచి 18 వేల మంది వరకు యాత్రికులు పాల్గొన్నారు. ఆలయ ధర్మకర్త సిహెచ్ అప్పలరామయ్య, కలగదండు సింహాచలం, కలగదండు మురళీ, కలగదండు శ్రీనివాస్, అప్పలసూరి ఆధ్వర్యంలో అప్పనమ్మకు ముర్రాటలతో పూజలు నిర్వహించారు.

ఘనంగా దేకురు కొండ ఉత్సవం

పలాస : పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో హట్కో కాలనీ పరిధిలో దేకురుకొండ ఉత్సవం సంక్రాంతి సందర్భంగా ఘనంగా జరిగింది. దేకురు కొండ ప్రాంతంలో భీముడు పాదాలు ఉంటాయి. జారుడు బల్ల లాంటి రాళ్లు ఉండటంతో ప్రతి ఏడాదీ నవ దంపతులు వాటిని దర్శించుకుంటారు. జారుడు బల్లపై జారితే సంతానం ప్రాప్తిస్తుందని వీరి నమ్మకం. దీంతో నవ దంపతులతో పాటు, కొత్త అల్లుళ్లు అక్కడకు వెళ్తుంటారు. దీంతో ఆ ప్రాంతమంతా వారితో కళకళలాడింది.

దేకురు కొండకు తరలివచ్చిన నవ దంపతులు

కొనుగోలు కోసం ఎదురుచూస్తున్న ధాన్యం బస్తాలు

దళారుల చేతుల్లో ధాన్యం

ప్రజాశక్తి - ఇచ్ఛాపురం

ప్రభుత్వం ఎన్నో ప్రకటనలు, సమావేశాలు పెట్టి రైతుల వద్ద ధాన్యం ఆర్‌బికె కేంద్రాల వద్ద నేరుగా కొనుగోలు చేస్తానన్న హామీలు గాలిలో కలిసిపోయింది. రైతులు ఎంతో కష్టపడి పండించిన ధాన్యం సరైన మద్దతుధర లేక, ప్రభుత్వం కొనుగోలు చేయకపోవడంతో దళారులు పంట పండింది. ఈ ప్రాంతంలో అనేక మంది రైతులు పండించిన ధాన్యం బస్తాలు రూ.100, రూ.200 తక్కువగా ఉన్నా గత్యంతర లేని పరిస్థితుల్లో దళారులకు అమ్మకాలు చేస్తున్నారు. మండలంలో ఉన్న ఏకైక మిల్లు ఉండటం అదీ కాస్త బ్యాంకు గ్యారెంటీ పరిమితి దాటిపోయింది. దీంతో పక్క మండలాలకు వెళ్లి అమ్మకాలు చేయాల్సిన పరిస్థితులు ఉండటం దూరం కావడం, వాహనాలు కూడా లభించకపోవడం నష్టమని తెలిసినా.. వచ్చిన దాంతో సరిపెట్టుకోవాల్సిన దుస్థితి వచ్చిందని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. గతం కంటే ఈ సారి ఖరీఫ్ సీజన్‌లో అధిక దిగుబడి రావడంతో కొంత వాడకానికి ఉంచి మిగిలిన ధాన్యం అమ్మకాలు చేస్తున్నారు. ఆరుబయట జాతీయ రహదారి వద్ద ధాన్యం బస్తాలు నిల్వ చేస్తూ దళారుల చేతికి అందిస్తున్నారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మంగా ధాన్యం కొనుగోలుకు చర్యలు తీసుకున్నా క్షేత్రస్థాయిలో సరైన ముందస్తు ప్రణాళిక లేకపోవడంతో ధాన్యం కొనుగోలులో అభాసుపాలు అయ్యారు. ఇప్పటికైనా మిగిలిన రైతులు నుండి ధాన్యం కొనుగోలుకు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

చలి కుమ్మేస్తోంది.. మంచు కమ్మేస్తోంది

జ్వరం, జలుబు, దగ్గుతో ఇబ్బందులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ఓ వైపు చలి గాలులతో ఉక్కిరిబిక్కిరి అవుతుండగా.. మరో వైపు పొగమంచు కమ్మేస్తూ ఉమ్మడి జిల్లాలోని ప్రజలను ఆస్పత్రుల పాల్జేస్తోంది. ముఖ్యంగా చిన్నారులు, వృద్ధుల ఆరోగ్యంపై ప్రభావం పడుతోంది. చల్లటి గాలులతో జ్వరం, జలుబు, దగ్గు, ఆయాసం తదితర కేసులు ఎక్కువగా నమోదవుతున్నాయి.

చలి, మంచు ప్రభావంతో చిన్నారులు జ్వరం, జలుబు, దగ్గుతో బాధపడుతున్నారు. వృద్ధులు, ఆస్తమా ఉన్న వారు ఆయాసంతో ఇబ్బందులు పడుతూ ఆస్పత్రుల్లో కృత్రిమ ఆక్సిజన్ తీసుకుంటున్నారు. ఈ నెలలో సర్వజనాసుపత్రితో పాటు టెక్కలి జిల్లా ఆస్పత్రిలో ఆస్తమా, ఇతర శ్వాశ సంబంధ ఇబ్బందులతో రోగులు వచ్చి చేరుతున్నారు. ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో గత నాలుగు రోజుల్లో వీరి సంఖ్య పెరుగుతోంది.

ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో ఆస్తమా రోగుల చికిత్సకు చెస్ట్ వార్డును ఏర్పాటు చేశారు. ఈ వార్డులో ఇన్‌పేషెంట్లను కూడా చేర్చుకునేందుకు ప్రత్యేక బెడ్లు, ఆక్సిజన్ సౌకర్యం అందుబాటులో ఉంది. జిల్లాలోని ఈ రెండు ప్రధాన ఆస్పత్రులను గత నాలుగు రోజుల్లో 427 మంది జ్వరంతో రాగా, వీరిలో సుమారు 60 మంది వరకు ఆక్సిజన్ కోసం ఎదురు చూస్తున్న వారే. ఎక్కువ మందిలో దగ్గు, జలుబుతో పాటు జ్వరాలతో వచ్చి చేరుతున్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో పరిస్థితి ఇలా ఉంటే ప్రైవేటు ఆస్పత్రులకు ఈ తాకిడి మరింత ఎక్కువగా ఉంటోంది.

మంటలతో జాగ్రత్త

శీతాకాలం కావడంతో ఎక్కడికక్కడ చలి మంటలు కాస్తున్నారు. ఈ సమయాల్లో అగ్ని ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని, జాగ్రత్తలు పాటించాలని అగ్నిమాపక శాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు. కుంపటి పెట్టే సమయాల్లో నిప్పు రాజుకుని ప్రధానంగా వృద్ధులు ప్రమాదాల్లో చిక్కుకున్న సందర్భాలున్నాయి. అందువల్ల ఈ సమయంలో కొన్ని జాగ్రత్తలు పాటించాల్సి ఉందని ఆ శాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు.

పొగమంచుతో రోడ్డు ప్రమాదాలు

జాతీయ రహదారిపై భారీ వాహనాలు అత్యంత వేగంగా ప్రయాణిస్తుంటాయి. మంచు కారణంగా రోడ్డు సరిగా కనిపించక ఎక్కడిక్కడే ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. రోడ్డు దాటుతున్న సమయంలోనూ అదుపుతప్పి వాహనాలు బోల్తాపడ్డ ఘటనలు లేక పోతేదు. ద్విచక్రవాహనాలపై పొగమంచు సమయంలో ప్రయాణించినప్పుడు కూడా ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి, ఇటీవల గుంటూరు నుంచి శ్రీకాకుళం జిల్లాలోని తన స్వగ్రామానికి తిరిగి ద్విచక్ర వాహనంపై వస్తున్న వ్యక్తి విజయనగరం జిల్లా భోగాపురం వద్ద రోడ్డు ప్రమాదానికి గురై మృతి చెందాడు. దట్టమైన పొగమంచు కారణంగా వాహనం నడుపుతున్న వ్యక్తి డివైడర్‌ను ఢీకొట్టి మృత్యువాత పడ్డాడు. కంచిలి సంత కూడలి వద్ద లారీ అదుపుతప్పి బోల్తాపడింది. జాతీయ రహదారి వెంబడి అనేక ప్రమాదాలు గత నాలుగు రోజుల్లో జరిగాయి. మంచువల్ల ఎదురుగా ఏముందో తెలియని పరిస్థితి. దీనికి తోడు కొందరు లారీ డ్రైవర్లు రోడ్డుపక్కనే వాహనాలు నిలుపుతున్నారు. మంచు కారణంగా దగ్గరికి వచ్చేవరకు ఆగి ఉన్న లారీ కనిపించక పోవడం ప్రమాదాలు సంభవిస్తున్నాయి. చలి తీవ్రత అధికంగా ఉండడం వల్ల అతివేగం ప్రమాదకరమని డెప్యూటీ ట్రాన్స్ పోర్టు కమిషనర్ శ్రీదేవి తెలిపారు. ఉదయాన్నే ద్విచక్ర వాహనాలపై ప్రయాణాలు చేసే వారు ఎక్కువగా ప్రమాదాల బారిన పడుతున్నారు. గత వారంలో 10కి పైగా కేసులు నమోదయ్యాయని పోలీసులు చెబుతున్నారు. చలిగాలి తీవ్రత దృష్ట్యా పిల్లలను బయటకు తీసుకెళ్లవద్దని నిపుణులు హెచ్చరిస్తున్నారు. పిల్లలకు వేడినీళ్లు, పాలు, ఆహారం సమయానుసారం ఇవ్వాలని ప్రజలు కోరుతున్నారు.

అయ్యో..! ఇంజినీరింగ్ అసిస్టెంట్లు

- పని బారెడు.. ఫలితం మూరెడు
- నేటికీ ఖరారుకాని విధి, విధానాలు

ప్రజాశక్తి - కవిటి

మండలంలోని బెజ్జిపుట్టుగ, దుగానపుట్టుగ, ఇద్దివానిపాలెం గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు మత్స్యకార గ్రామమైన కొత్తపాలెంలో జగనన్న లే అవుట్లు కేటాయించారు. అందులో మంజూరు చేసిన 27 ఇళ్లలో 20మంది అక్కడకు వెళ్లేందుకు ససేమీరా ఒప్పుకోవడం లేదు. సర్పంచ్, స్థానిక నాయకులు, హౌసింగ్ ఎఇ, ఇంజినీరింగ్ అసిస్టెంట్ ఎందరు చెప్పినా వారు వినలేదు. కానీ డిసెంబరు 11న జరిగిన కలెక్టర్ సమావేశంలో బెజ్జిపుట్టుగ ఇంజినీరింగ్ అసిస్టెంటుపై కలెక్టర్ ఫైర్ అయ్యారు. అదే సచివాలయం పరిధిలో.. అదే ఇంజినీరింగ్ అసిస్టెంట్ పర్యవేక్షణలో సొంత స్థలంలో జగనన్న ఇళ్లు కట్టుకుంటున్న 38 లబ్ధిదారుల్లో 32 మంది ఇళ్లువివిధ దశలు దాటి నిర్మాణాలు పూర్తి చేసుకుంటున్న విషయాన్ని అధికారులు విస్మరించారు. ఇక్కడ బాధ్యత అందరిదైనా.. ఆగ్రహానికి గురైంది ఇంజినీరింగ్ అసిస్టెంట్. ఇది కేవలం కవిటి మండలం బెజ్జిపుట్టుగ ఇంజినీరింగ్ అసిస్టెంట్ సమస్య మాత్రమే కాదు. జిల్లాలో పనిచేస్తున్న అందరిదీ.

ఓటరు నమోదు వేగవంతం చేయాలని పైనుంచి ఆదేశాలు వస్తే కనిపించే మొదటి ప్రత్యామ్నాయం వీరు. మీ పంచాయతీలో హౌసింగ్ పనులు ఎంతవరకు వచ్చాయి అని అడిగితే చూపించేది వీరినే. చివరికి పంచాయతీలో శానిటేషన్ పనులు సరిగ్గా జరగడం లేదని అన్నా చూపుడు వేలు వీరిపైకి తిరుగుతుంది. పిఆర్ నుంచి ఆర్‌అండ్‌బి వరకు, బిఎల్ఒ నుంచి శానిటేషన్ వరకు ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగానే కాదు జిల్లా వ్యాప్తంగా ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు తమ పంచాయతీ, సచివాలయం పరిధిలో ఉన్న పని ఒత్తిడికి నిదర్శనమే పై ఉదాహరణలు. ఇది కేవలం ఒకవైపు మాత్రమే. మరోవైపు జిల్లా పరిషత్ కానీ పంచాయతీ రాజ్ కానీ ఎక్కడ ఎటువంటి పని ఉందన్నా ముందుగా గుర్తుకు వచ్చేది వీరే. అయితే అన్ని పనులు ఓపిగ్గా చేస్తున్నా తమ పనికి తగిన ప్రతిఫలం తమకు దక్కడం లేదని వారు వాపోతున్నారు. ఇప్పటివరకు వీరికి సంబంధించిన టెక్నికల్ పే స్కేల్, టిఎ, సర్వీస్ రూల్స్, ఉద్యోగోన్నతుల్లో స్పష్టమైన ఆదేశాలను ప్రభుత్వం ఇవ్వలేదు. 90శాతానికి పైగా వీరంతా ఇంజినీరింగ్ పట్టభద్రులు. ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు కేటగిరీ 8 కేటాయించడం, పదో తరగతి అర్హతతో ఉన్న బ్లూ ప్రింట్ ఆపరేటర్‌కు కేటగిరీ 7 కేటాయించడంపై సర్వత్రా నిరసన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు నాడు-నేడు, ఆర్‌అండ్‌బి, ఆర్‌డబ్ల్యుఎస్, పిఆర్, హౌసింగ్ తదితర శాఖల పనులు చేస్తున్న ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు బిఎల్ఒ, శానిటేషన్ తదితర పనులు అదనంగా అప్పగిస్తున్నారు. వీటితో పాటు వీరి డిడిఒ పని చేయకపోతే ఇక అంతే సంగతి. దీంతో వీరిపై పని భారం పెరుగుతోంది.

బయోమెట్రిక్ తిప్పలు

విధి నిర్వహణలో ఎక్కువ శాతం క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు బయోమెట్రిక్ పెద్ద సమస్యగా మారుతోంది. వీరు కచ్చితంగా సచివాలయంలో మాత్రమే బయోమెట్రిక్ వేయాలనే నిబంధన ఉండడంతో కార్యాలయం పనిమీద సబ్ డివిజన్‌కు వెళ్లినా, హౌసింగ్, ఆర్‌అండ్‌బి, తదితర అంశాలపై క్షేత్రస్థాయిలో పనిచేస్తున్నా వీరికి బయోమెట్రిక్ సమస్యగా మారుతోంది. ఫీల్డ్‌లో పనిచేస్తున్న విఆర్‌ఒలు, సర్వేయర్లు, అగ్రికల్చరల్ అసిస్టెంట్లకు బయోమెట్రిక్ మినహాయింపు ఉంది. వీరితో పాటుగా క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న తమకు బయోమెట్రిక్ మినహాయింపు కల్పిస్తే తమకు న్యాయం జరుగుతుందనేది వీరి అభిప్రాయం.

నాడు-నేడు పనులు పరిశీలిస్తున్న ఇంజినీరింగ్ అసిస్టెంట్లు(ఫైల్)

విధి విధానాలు ఖరారు చేయాలి

ఇంతవరకు ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు సంభందించి సర్వీస్ రూల్స్, ఉద్యోగోన్నతులు గురించి స్పష్టమైన ఆదేశాలు లేవు. అంతేకాకుండా మాకు టెక్నికల్ పే స్కేల్, టిఎ కూడా లేవు. మాకంటే తక్కువ గ్రేడుకు చెందిన వారిని కేటగిరీ 7లో చేర్చి, మాకు కేటగిరీ 8లో చేర్చారు. వాస్తవానికి రాష్ట్రంలోని 11వేల మంది ఇంజినీరింగ్ అసిస్టెంట్లలో 90 శాతానికి పైగా ఇంజినీరింగ్ విద్యను అభ్యసించిన వారే. మాకు కేటగిరీ 2లో ఉంచాలి. కానీ కేటగిరీ 8ఎందుకు కేటాయించారో తెలియదు. మమ్మల్ని పూర్తిస్థాయిలో ఎంపిడిఒ అధీనంలో చేరిస్తే కొంత వెసులుబాటు ఉంటుంది. ఎందుకంటే 5, 6 శాఖల పని చేస్తున్నప్పుడు అందరికీ సమన్వయం చేసుకోవడంలో సమస్యలు సహజం. అదే ఒకే సుపీరియర్ ఉన్నప్పుడు సమన్వయం సాఫీగా సాగిపోతుంది. మా కేటగిరీ మార్చడంతో మాకు ఉద్యోగోన్నతుల్లో న్యాయం జరుగుతుంది.

-కె.సూర్యభరత్,
ఇంజినీరింగ్ అసిస్టెంట్ల జిల్లా అధ్యక్షులు

భారమైనా.. బాధ్యతగా చేస్తున్నాం

నాలుగైదు శాఖల అధికారులు, నాలుగైదు రకాల పనులు ఒకేసారి చేయాల్సి వస్తున్నా బాధ్యతగా చేస్తున్నాం. కానీ ఫలితం లేకపోతోంది. ముఖ్యంగా ఇళ్ల నిర్మాణంలో చాలా సమస్యలు ఎదురవుతున్నాయి. తమతమ గ్రామాలకు దూరంగా వెళ్లేందుకు లబ్ధిదారులు అంగీకరించడం లేదు. అయినప్పటికీ శక్తివంచన లేకుండా కషి చేస్తున్నాం.

-ఉప్పాడ జయకృష్ణ,
ఇంజినీరింగ్ అసిస్టెంట్ల జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ

బాబు పర్యటనను అడ్డుకోవడం

అధికార దుర్వినియోగమే

టిడిపి రాష్ట్ర అధ్యక్షులు అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి - కోటబొమ్మాళి



అక్రమ కేసులతో పండుగ పూట పుంగనూరు టిడిపి నేతలను మంత్రి పెద్దిరెడ్డి జైలులో పెట్టించి, పెద్ద తప్పు చేశారని, పండగపూట జైలులో ఉన్నవారి కుటుంబాల ఉసురు ఆయనకు తగలకమానదని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షులు కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. సోమవారం నిమ్మాడలో ఆయన విలేకరులతో మాట్లాడారు. బాధితుల పరామర్శకు వెళ్తున్న ప్రతిపక్ష నేత నారా చంద్రబాబునాయుడు పర్యటనకు వ్యతిరేకంగా పెద్దిరెడ్డి బ్యానర్లు కట్టిండంచ, టిడిపి బ్యానర్లు చించడం మరో తప్పు అని, ప్రతిపక్ష నేత పర్యటనకు వ్యతిరేకంగా పోలీసులపై ఒత్తిడి తెచ్చి సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌తో 30 యాక్టు నోటీసు ఇప్పించడం అధికార దుర్వినియోగమేనన్నారు. ఉభయ గోదావరి జిల్లాలు కృ ష్ణా, గుంటూరు జిల్లాల్లో పోలీస్ యాక్టు 30 ఉన్నా యథేచ్ఛగా కోడి పందేలు, జూదాలు జరుగుతున్నాయని, మరి ఇక్కడ పోలీస్ యాక్టు 30 ఏమైందని, కేవలం ప్రతిపక్షాల్ని ప్రజల వద్దకు, బాధితుల వద్దకు వెళ్లకుండా నిరోధించడానికి అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారని ఆరోపించారు. పెద్దిరెడ్డి తప్పు చేయకపోతే ప్రతిపక్ష నేతను ఎందుకు అడ్డుకునే కుట్రలు చేస్తున్నారని, ప్రజల్ని బయపెట్టి ల్యాండ్, శాండ్, వైన్, మైన్, రెడ్ శాండిల్ కుంభకోణాలు చేస్తున్నారని, ఇవి బయటపడతాయనే భయంతోనే ప్రజలపై, ప్రతిపక్షాలపై దాడులు చేయిస్తున్నారని అచ్చెన్నాయుడు ఆరోపించారు. దీనిపై డిజిపి జోక్యం చేసుకొని ప్రతిపక్ష నేత పర్యటన సజావుగా జరిగేందుకు తగు చర్యలు తీసుకోవాలి అచ్చెన్నాయుడు కోరారు.

పొడి బెల్లం తయారీపై రైతన్న మొగ్గు

సాగు చేసిన చెరుకును చూపిస్తున్న రైతు

ప్రజాశక్తి- ఆమదాలవలస

ద్రవ పొడి బెల్లాలను ఉత్పత్తి చేయడం ద్వారా గిట్టుబాటు ధర వస్తుందని రైతులు చెబుతున్నారు. మండలంలోని నాగావళి నది పరివాహక ప్రాంతంలోని నిమ్మతొర్లాడ, చేపేనపేట, జి.కె.వలస, కొరపాం, బుడితిపేట తదితర పది గ్రామాల్లో చెరుకును పండించి రైతులు బెల్లం తయారు చేస్తుంటారు. చెక్కిల రూపంలో తయారు చేసిన బెల్లాన్ని మార్కెట్‌కు తరలించి అమ్మకాలు చేస్తారు. దీపావళి నుంచి పండగ వరకు గ్రామాల్లో వివిధ రకాలైన పిండి వంటల్లో బెల్లాన్ని ఎక్కువగా వినియోగిస్తుంటారు. అందుకే ఈ సీజన్లో మార్కెట్లో బెల్లానికి ఎక్కువగా డిమాండ్ ఉంటుంది. అక్టోబరు నుంచి జనవరి వరకు బెల్లం తయారు చేసే గానుగలను మొదలు పెడతారు. చెరుకు సాగుకు భూములు అనుకూలంగా ఉండడంతో ఎక్కువ మంది రైతులు వరికి బదులుగా చెరుకును సాగు చేస్తుంటారు. ఈ ప్రాంత భూములు మంచి సారవంతమైనవి కావడంతో సేంద్రీయ పద్ధతిలో చెరకును సాగు చేసి రసాయనాలు లేని బెల్లాన్ని తయారు చేస్తుంటారు. ఈ ప్రాంత రైతులు ఎకరా పొలంలో పండే చెరకు పంటను బెల్లంగా మార్చేందుకు 15 నుంచి 20 రోజులు పడుతుంది. చెరకును గానుగుల వద్దకు తీసుకువచ్చి నునుపుగా చేసి గానుగ యంత్రం ద్వారా రసం తీసి ఈ రసాన్ని ఇనప పెనంలో వేసి ముదురుపాకం వచ్చేవరకు సన్నని మంటపై వేడి చేస్తూ పాకం వచ్చాక పక్కనే ఉన్న ఇనప పల్లెల్లో బెల్లం పాకం వేసి చెక్కీలు తయారు చేస్తారు. గతంలో మట్టి కుండల్లో బెల్లం వేసి కేజీ, రెండు కేజీల బెల్లం కుండలను విక్రయించేవారు. టెక్నాలజీ అందుబాటులోకి రావడంతో చెక్కీలను తయారు చేస్తున్నారు. చిన్న చెక్కీ ఆరు నుంచి ఎనిమిది కేజీలు, పెద్ద చెక్కీలు 14 నుంచి 20 కిలోల వరకు తయారు చేస్తున్నారు. వాటిని కవర్లలో పెట్టి మార్కెట్లలో విక్రయిస్తారు. ఇక్కడ తయారయ్యే బెల్లం మంచి నాణ్యత కలిగి ఉంటుందని, అందుకే ఇతర జిల్లాలకూ ఎగుమతి అవుతుందని రైతులు, వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. చెరకు పంట సాగుకాలం 9 నుంచి 11 నెలలు పడుతుంది. చెరకును ఫిబ్రవరి మార్చి నెలలో నాటుతారు. ఎకరాకు 40 నుంచి 50 టన్నుల దిగుబడి వస్తుందని రైతులు, వ్యవసాయాధికారులు చెబుతున్నారు.

బెల్లం చెక్కీలు

యంత్రంతో కలుపు తీసుకున్న కృష్ణ

సబ్సిడీ రుణాలు ఇవ్వాలి

బెల్లం దిగుబడి మొక్క చెరుకుకు ఐదు టన్నులు, మమ్మ చెరుకుకు రెండు నుంచి మూడు టన్నుల దిగుబడి వస్తుంది. బెల్లం తయారు చేసే రైతులను రైతు భరోసా కేంద్రాల ద్వారా గుర్తించి సబ్సిడీ రుణాలను అందించాలి. పంచదార కంటే బెల్లంలో పోషకాల విలువ ఎక్కువ అని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. ఈ మధ్యకాలంలో ఆర్ట్స్ స్వచ్ఛంద సంస్థ సహకారంతో ద్రవ పొడి బెల్లాలను తయారు చేస్తున్నాం. మార్కెటింగ్ కూడా తామే చేసుకుంటూ దళారీ వ్యవస్థ లేకుండా అమ్మకాలను కొనసాగిస్తున్నాం. గిట్టుబాటు అవుతుంది.

– ముద్దాడ కృష్ణ, అభ్యుదయ రైతు, నిమ్మతొర్లాడ

జ్ఞాపికను స్వీకరిస్తున్న మనో

అరసవల్లికి విఐపిల తాకిడి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయానికి విఐపిల తాకిడి పెరిగింది. ఆదివారం సినిమా నేపథ్య గాయకుడు నాగూర్‌బాబు (మనో) కుటుంబ సభ్యులతో కలిసి అరసవల్లిని సందర్శించారు. అలాగే ఎస్‌పి జి.ఆర్.రాధిక కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. అవినీతి నిరోధకశాఖ జాయింట్ డైరెక్టర్ జె.రామ్మోహనరావు, తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జి.అనుపమాచక్రవర్తిలు వారివారి కుటుంబ సభ్యులతో కలిసి సందర్శించారు. రాజమండ్రి సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి భవాని కుటుంబ సభ్యులు దర్శించుకున్నారు. వారికి ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆలయ మర్యాదలతో స్వాగతించారు. స్వామి వారికి నిర్వహించిన పలు సేవల అనంతరం వారికి ఆలయ ప్రాంగణంలోని అనివేటి మండపంలో శేషవస్త్రాలను బహూకరించారు. అనంతరం ఆలయ సూపరింటెండెంట్ కె.వెంకటేశ్వరరావు వారికి జ్ఞాపికలను అందజేశారు.

ఆలయ ప్రాంగణంలో గోసేవ

సంక్రాంతి వేడుకల్లో మూడో రోజైన కనుమ పండగ సందర్భాన్ని పురస్కరించుకుని అరసవల్లి సూర్యనారాయణస్వామి ఆలయ ప్రాంగణంలో సోమవారం గోసేవ నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకర శర్మ ఆవులకు గోపూజ నిర్వహించారు. ఆలయ సంప్రదాయ బద్ధంగా నిర్వహించిన ఈసేవలో గోసేవ ప్రాధాన్యతను వివరించారు. కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ కె.వెంకటేశ్వరరావు, బి.ఎస్.చక్రవర్తి, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

ట్రోఫీని అందజేస్తున్న వసంతస్వామి

కబడ్డీ విజేత చిన్నమురహరిపురం

వజ్రపుకొత్తూరు: క్రీడాకరులు క్రీడా స్ఫూర్తితో ముందుకు సాగాలని మాజీ ఎంపిపి, పెద్దమురహరిపురం సర్పంచ్ గొరకల వసంతస్వామి అన్నారు. సంక్రాంతి సందర్భంగా చిన్నమురాహరిపురంలో నిర్వహించిన నియోజకవర్గస్థాయి కబడ్డీ పోటీలు ముగిశాయి. ప్రథమ భాహుమతిగా చిన్నమురహరిపురం, ద్వితీయ బహుమతి సీతానగరం, తృతీయ బహుమతి శివరాంపురం జట్టులు గెలుపొందాయి. ఈ సందర్భంగా మాట్లాడుతూ నేను సైతం యూత్ కబాడ్డీ ఆటలు గ్రామంలో నిర్వహించడంతో అభినందనలు తెలిపారు. అనంతరం విజేతలకు బహుమతులు, ట్రోఫీలను అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కె.గోపాల్, ఎంపిటిసి వసంతరావు, గ్రామ పెద్దలు గన్నెయ్య, గొరకల రామారావు, చలపతిరావు, దాసు గోపాలకృష్ణ పాల్గొన్నారు.

ఎన్‌టిఆర్ వర్ధంతిని విజయవంతం చేయాలి

ఆమదాలవలస : ఈ నెల 18న తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు, మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు వర్ధంతిని నిర్వహిస్తున్నామని టిడిపి జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ముందుగా పారిశ్రామిక వాడ వద్ద ఉన్న ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లర్పిస్తామని పేర్కొన్నారు. అలాగే రక్తదాన శిబిరం ఏర్పాటు చేశామని చెప్పారు. ఆయా కార్యక్రమాలకు కార్యకర్తలు, అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

అనుసంధాన కాలువ పనులు పూర్తయ్యేదెప్పుడు?

- **ఆశగా ఎదురుచూస్తున్న రైతులు**
- **పట్టించుకోని ప్రభుత్వం**

ప్రజాశక్తి- బూర్జ

అన్నదాత దేశానికి వెన్నుముక... రైతే రాజు వంటి కొటేషన్లు చెప్పుకోవడానికి తప్ప రైతులను ఆదుకునేందుకు ఏ ప్రభుత్వం పట్టించుకోవడంలో విఫలమయ్యారని తేటతెల్లం అవుతుంది. ఏటా రైతులకు అవసరమైన సాగునీటిని సకాలంలో పుష్కలంగా అందిస్తామని ఆర్భాటంగా ప్రకటిస్తున్న ప్రభుత్వం ఆచరణలు శూన్యం అవుతుంది. మండలంలోని రైతన్నలు ఏటా సాగునీరు అందక నష్టపోతూనే ఉన్నారు. వంశధార, నాగావళి నదుల అనుసంధానంతో నిర్మించిన కాలువ పనులు అర్ధాంతరంగా నిలిచిపోవడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మూడేళ్ల కిందట హిరమండలం దగ్గరలో ఉన్న వంశధార నది నుంచి ఎల్ఎన్‌పేట, సరుబుజ్జిలి మండలాలు మీదుగా బుర్జ మండలం నారాయణపురం నాగావళి నదికి అనుసంధానం చేస్తూ 33 కిలోమీటర్ల కాలువ పనులకు గత టిడిపి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. రైతులకు నష్టపరిహారం అందజేసేందుకు కాలువ నిర్మాణానికి రూ.79 కోట్లు నిధులను మంజూరు చేసింది. ఎంతో ఆర్భాటంగా ప్రారంభించిన ఈ పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. అధికారులు మాత్రం 70 శాతం వరకు పనులు చేపట్టామని చెబుతున్నారు. కానీ, ఆ దిశగా పనులు చేపట్టిన దాఖలు కనిపించడం లేదని ఈ పనులను చూస్తే తెలుస్తోంది. నాగావళి నది నుంచి ఎడమ కాలువ ద్వారా మండలంలోని 30 వేల ఎకరాలకు సాగునీరు అందుతుంది. ఈ కాలువ అనుసంధానం ద్వారా అన్నంపేట, చీడివలస, అయ్యవారిపేట, సింగన్నపాలెం, లచ్చయ్యపేట తదితర గ్రామాలకు మరో ఐదు వేల ఎకరాలకు సాగునీరు అందించేందుకు అవకాశం ఉంటుంది.

అడుగడుగునా అడ్డంకులే

కాలువ పనులకు అడుగడుగునా అడ్డంకులు ఎదురవుతున్నాయి. కాలువ నిర్మాణానికి భూసేకరణ విషయంలో రైతులకు నష్టపరిహారం చెల్లించేందుకు గత ప్రభుత్వం రూ.79 కోట్లు నిధులు మంజూరు చేసింది. అయినా రైతులకు, ప్రభుత్వానికి సమన్వయం లేకపోవడంతో పరిహారం అందలేదని రైతులు చెబుతున్నారు. అలాగే దేవాలయ భూములను కౌలు చేస్తున్న రైతులు నష్టపరిహారం చెల్లించాలని కోరారు. ఇలా కాలువ నిర్మాణంలో సమస్యలు తలెత్తడంతో పనులను అర్ధాంతరంగా నిలిచిపోయాయి.

నిలిచిన కాలువ పనులు

త్వరగా పూర్తి చేయాలి

ఏటా సాగునీటికి అవస్థలు పడుతున్నాం. వచ్చే ఏడాది ఖరీఫ్ నాటికైనా కాలువ అనుసంధానం పనులు పూర్తి చేస్తే మంచిది. అందుకు ప్రభుత్వం, అధికారులు చర్యలు తీసుకోవాలి. దీంతో ఈ ప్రాంతమంతా సస్యశ్యామలమవుతుంది.

– తులగాపు శ్రీనివాస్, రైతు, సింగన్నపాలెం

ఆర్థికసాయం అందజేస్తున్న శేషగిరినాయుడు

చిన్నారికి ఆర్థికసాయం

ప్రజాశక్తి- పొందూరు

మండలంలోని బొడ్డేపల్లికి చెందిన గురుగుబెల్లి లాస్య ఆరు నెలల నుంచి బ్లడ్ కేన్సర్‌తో బాధపడు తుంది. విషయం తెలుసుకున్న కొంతమంది దాతలు సోమవారం ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా టిడిపి మండల ఉపాధ్యక్షుడు, పొందూరు ఎంపిటిసి-4 ప్రతినిధి బాడాన శేషగిరినాయుడు, బొడ్డేపల్లి వైకుంఠరావులు రూ.11 వేలు, తాడివలస పూర్వ విద్యార్థుల వాట్సప్ గ్రూపు సభ్యులు రూ.36 వేలు చిన్నారి తండ్రి గురుగుబెల్లి వాసుదేవరావుకు అందజేశారు. బొడ్డేపల్లికి వారూ తమ వంతు ఆర్థిక సహాయం అందించడానికి కృషి చేస్తున్నారని కుటుంబ సభ్యులు తెలిపారు. చిన్నారిని దాతలు ముందుకొచ్చి ఆదుకోవాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

తరలివచ్చిన యాత్రికులు

తొగరాంలో వల్లభనారాయణస్వామి యాత్ర

ప్రజాశక్తి- ఆమదాలవలస

మండలంలోని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం స్వగ్రామం తొగరాంలో వల్లభ నారాయణస్వామి, లక్ష్మీనరసింహ స్వామి ఆలయాలు ఉన్నాయి. గతంలో సంక్రాంతి, కనుమ, ముక్కనుమ మూడు రోజులపాటు ఇక్కడ యాత్ర నిర్వహించేవారు. ఈ యాత్రకు మండలం నుంచి పలు గ్రామాల ప్రజలు, అలాగే నాగావళి నది అవతల వైపు ఉన్న సంతకవిటి, రాజాం మండలాల నుంచి వేలాది మంది యాత్రికులు పాల్గొనేవారు. కానీ, ప్రస్తుతం యాత్రికుల వచ్చే తగ్గడంతో కేవలం కనుమ రోజు మాత్రం ఆలయ కమిటీ సభ్యులు నిర్వహించారు. ఇందులో భాగంగా సోమవారం నిర్వహించిన యాత్రలో కలివరం, కొత్తవలస, ఇసుకలపేట, దిబ్బలపేట, నారిపేట, గండ్రేడు, ముద్దాడపేట తదితర గ్రామాల నుంచి యాత్రికులు తరలివచ్చారు.

తిరుపతిపాలెంలో దుస్తులను పంపిణీ చేస్తున్న సర్పంచ్ రవి

దుస్తుల పంపిణీ

రణస్థలం రూరల్: మండలంలోని తిరుపతిపాలెం పంచాయతీ సర్పంచ్ ఆకుల రవి కుమార్, సంచాం పంచాయతీలో సర్పంచ్ రెడ్డి సూర్యకాంతం రాము, దేరాసాం పంచాయతీలో వైసిపి నాయకులు దన్నాన శ్రీనివాసరావు, జె.ఆర్.పురం పంచాయతీలో టిడిపి నాయకులు కొప్పిసెట్టి లక్ష్మణరావు, డి.జి.ఎం.ఆనందరావు, వైసిపి నాయకులు రాయపురెడ్డి బుజంగరావు, కోష్ట పంచాయతీలో మాజీ సర్పంచ్ పిసిని జగన్నాథంనాయుడు, సర్పంచ్ ప్రతినిధి పిసిని లక్ష్మణరావు, కొచ్చెర్ల పంచాయతీలో ఎంపిటిసి బస్వ గోవిందరెడ్డి, మాజీ సర్పంచ్ బస్వ దురుగుబాబు, పైడిభీమవరంలో జనసేన నాయకులు వడ్డాది శ్రీనివాసరావులు సంక్రాంతిని పురస్కరించుకొని పేదలకు దుస్తులను పంపిణీ చేశారు.

మృతదేహాన్ని తరలిస్తున్న సిబ్బంది

ఒంటరి మహిళకు అంత్యక్రియలు

శ్రీకాకుళం అర్బన్: నగరంలోని బలగ వీధి బోడమ్మ ఆలయం దగ్గర నివసిస్తున్న లత తన భర్త ద్వారా విడాకులు తీసుకొని ఒంటరిగా జీవిస్తుండేది. సోమవారం ఉదయం ఆమె ఆకస్మికంగా మృతి చెందింది. విషయం తెలుసుకున్న రెడ్‌క్రాస్ ఛైర్మన్ పి.జగన్మోహన రావు స్థానికులు, రెడ్‌క్రాస్ బృందం సహకారంతో నాగావళి నది ఒడ్డున అంత్యక్రియలను నిర్వహించారు. కార్యక్రమంలో స్థానికులు కె.మోష, కె.మొర్య, ఎస్.శ్రీరామ్మూర్తి, కె.శివప్రసాద్, రెడ్‌క్రాస్ సభ్యులు సాయి సుధాకరరావు, నంది ఉమాశంకర్, పవన్‌కుమార్, తవుడు, గాంధీ, జగదీశ్వరరావు, నాని, సునీత దేవి, బి.మురళి, టి.మురళి, సోమేశ్వరరావు పాల్గొన్నారు.



సన్మానిస్తున్న సర్పంచ్ మదన్

కిరణ్, ప్రవీణ్‌లకు సన్మానం

పలాస: మండలంలోని బొడ్డపాడులో నూతనంగా ఉద్యోగాలు సాధించిన సాహుకారి కిరణ్, ప్రవీణ్‌లకు బొడ్డపాడు గ్రామస్తుల సహకారంతో సర్పంచ్ తామాడ మదన్ దుశ్శాలువ కప్పి సన్మానించారు. షావుకారు కిరణ్ ఎస్ఎస్‌సి, సిజిఎల్ జాతీయ స్థాయిలో 823 ర్యాంకు సాధించి జిఎస్‌టి ఇన్‌స్పెక్టర్‌గా ఉన్నతమైన ఉద్యోగం సాధించారు. ప్రవీణ్ సైనిక రంగానికి ఎంపికయ్యారు. అందుకు గ్రామస్తులు సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో యువిపి ప్రధాన కార్యదర్శి బొడ్డు చిన్నారావు, గౌరవ అధ్యక్షులు బి.ఓంకారం పాల్గొన్నారు.

ఐదుగురు జూదర్లు అరెస్టు

టెక్కలి రూరల్ : కనుమ పండగ సందర్భంగా సోమవారం నౌపడ ఆర్ఎస్ కాలనీలో జూదం ఆడుతున్నారనే సమాచారం మేరకు టెక్కలి ఎస్ఐ ఎల్.రామకృష్ణ సిబ్బందితో వెళ్లి పేకాట శిబిరంపై దాడి చేశారు. పేకాట ఆడుతున్న ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.5200 నగదును స్వాధీనపర్చుకున్నారు. ఈ మేరకు వారిని, గ్రామస్తులను హెచ్చరించి జూదరులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

సైనికుల సేవలు వెలకట్టలేనివి

ప్రజాశక్తి- కవిటి

ప్రాణానికి ప్రాణంగా చూసుకునే తల్లిదండ్రులు, తన కోసం కన్న వారిని సైతం వదిలి వచ్చే కట్టుకున్న భార్యను విడిచి దేశం రక్షణ కోసం అహరం శ్రమించే సైనికులకు ఏమిచ్చినా రుణం తీర్చుకోలేమని, వారి సేవలు వెలకట్టలేనివని పచ్చదనం సుందరీకరణ కార్పొరేషన్ ఛైర్మన్ నర్తు రామారావు అన్నారు. 17 ఏళ్లఆర్మీలో పనిచేసి ఇటీవల ఉద్యోగ విరమణ చేసిన గ్రామానికి చెందిన నర్తు లక్ష్మీనారాయణకు సైనిక దినోత్సవం సందర్భంగా ఆదివారం నర్తుపుట్టుగలో ఘనంగా సన్మానించారు. గ్రామానికి చెందిన మాతృభూమి రుణం తీర్చుకో సంఘం ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న మాట్లాడారు. లక్ష్మీనారాయణ అటు దేశ సేవలో ఉంటూనే బిటెక్, బికాం, ఎంబిఎ కోర్సులు చేసి యువతకు ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. కార్యక్రమంలో నర్తు సోమేశ్వరరావు, దేవరాజు, వాసుదేవ్, కోటేశ్వరరావు, గ్రామ పెద్దలు సీతయ్య, అశోక్ పాల్గొన్నారు.

లక్ష్మీనారాయణను సన్మానిస్తున్న రామారావు

సందడిగా సంక్రాంతి

ప్రజాశక్తి- కవిటి

మండలంలో సంక్రాంతి సంబరాలు సందడిగా నిర్వహించారు. స్థానిక అగ్నికుల క్షత్రియ సంఘం ఆధ్వర్యాన రంగవల్లుల పోటీలు నిర్వహించి, స్థానిక కళాకారులను ఘనంగా సన్మానించారు. రంగవల్లుల పోటీల్లో విజేతలకు సన్మాన కార్యక్రమంతో పాటు నగదు, జ్ఞాపికలను అందజేశారు. ఈ సందర్భంగా ప్రముఖ శిల్పి గుప్పి షణ్ముఖరావు, వర్ధమాన గాయకుడు సంగారు రాము, పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన దున్న కాశి, పొల్లాయి జస్వంత్‌తో పాటు శ్మశాన వాటికలో సేవలందిస్తున్న ఉమాపతి, నూకయ్యలకు దుశ్శాలువ కప్పి సన్మానించారు. కార్యక్రమంలో పొల్లాయి లక్ష్మణమూర్తి, పొల్లాయి దానయ్య, పొల్లాయి మండల అప్పారావు, పొల్లాయి సింహాచలం, పొల్లాయి కృష్ణ, దున్న పురుషోత్తం, తెప్పల రవి, సుజాత, లోకనాథం, దేవరాజు పాల్గొన్నారు.

కొత్తూరు : ఆర్థికసాయం అందజేస్తున్న గోవిందరావు

కొత్తూరు : మండలం అంగూరులో ఎంజిఆర్ యువసేన సభ్యులు సంక్రాంతి సందర్భంగా ముగ్గులు పోటీల పోటీలు నిర్వహించారు. అనంతరం విజేతలకు సామాజిక వేత్త, టిడిపి నాయకులు మామిడి గోవిందరావు రూ.పది వేలు నగదు అందజేశారు. అలాగే రామాలయ అభివృద్ధికి రూ.5 వేలు ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో రగుతు గోవిందరావు, రగుతు బాలయ్య, టిడిపి నాయకులు యాగాటి లక్ష్మణరావు, కాగితాపల్లి అనంతరావు పాల్గొన్నారు.

కవిటి : విజేతలకు బహుమతులు అందిస్తున్న పెద్దలు

ఉత్సాహంగా గాలిపటం పోటీలు



గాలిపటం పోటీలో పాల్గొన్న చిన్నారులు

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

పట్టణంలో బెల్లుపడాలో ఉన్న త్రినాథస్వామి కొండపై నిర్వహించిన కనుమ వేడుకల సందర్భంగా సోమవారం గాలి పటాలు పోటీలు ఉత్సాహంగా నిర్వహించారు. ఈ పోటీలో ప్రథమ స్థానం దుర్గాసి మనోహర్, ద్వితీయ స్థానం ఎదురు కుమార్, తృతీయ స్థానంలో బొరబాబు విజేతలుగా నిలిచారు. అనంతరం విజేతలకు బహుమతులను అందజేశారు. సాయంత్రం నిర్వహించిన కుమార డ్యాన్స్ మాస్టర్ నృత్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యాన నిర్వహించిన ఈ యాత్రకు యాత్రికులు భారీగా తరలివచ్చారు.

హెల్పింగ్ హేండ్స్ సేవలు భేష్

ప్రజాశక్తి- కవిటి

అభాగ్యలకు అండగా ఉంటూ, కష్టాల్లో ఉన్నవారికి తమ భరోసా అందిస్తూ హెల్పింగ్ హేండ్స్ అందిస్తున్న సేవలు వెలకట్టలేనివని వైస్ ఎంపిపి కర్రి గోపయ్య అన్నారు. ఇటీవల రైలు ప్రమాదంలో తన భర్తను కోల్పోయిన పెద్ద కర్రివానిపాలెంకు చెందిన కర్రి రూపవతి దయనీయ స్థితిలో ఉంది. విషయం తెలుసుకున్న హెల్పింగ్ హేండ్స్ సంస్థ సభ్యులు ఆదివారం గ్రామానికి చేరుకుని వైస్ ఎంపిపి గోపయ్య రూ.6 వేలు, రెండు నెలలకు సరిపడే నిత్యావసర సరుకులు అందజేశారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ కేవలం మండలంలోనే కాకుండా జిల్లా వ్యాప్తంగా హెల్పింగ్ హేండ్స్ సంస్థ తన సేవలు అందిస్తున్నట్టు తెలిపారు. సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలనుకునేవారు హెల్పింగ్ హేండ్స్‌కు అండగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో హెల్పింగ్ హేండ్స్ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందిస్తున్న గోపయ్య

కుట్టుమిషన్ల పంపిణీ

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

రోటరీక్లబ్ భవనంలో 24 మంది పేదలకు రోటరీక్లబ్ అధ్యక్షులు ఎం.నవీన్‌కుమార్ సోమవారం అందజేశారు. రూ.9 వేలు విలువ చేసే ఎలక్ట్రికల్ మోటర్‌తో కలిపి కుట్టుమిషన్లను అందజేశారు. కార్యక్రమంలో ఎస్.రోహిత్, దక్కత కృష్ణమూర్తిరెడ్డి, వి.సురేష్, ఎం.జి.రామన్, జోహర్‌ఖాన్, రామారావు, అమీర్ ఆలీ, దినేష్, ప్రఫుల్ల కుమార్ పండా, పాక తులసీదాస్ తదితరులు పాల్గొన్నారు.

కుట్టుమిషన్లను పంపిణీ చేస్తున్న నవీన్‌కుమార్

రోడ్డు బాగు చేయాలని వినతి

వినతిపత్రం అందజేస్తున్న దుర్యోధనరెడ్డి

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

మండలంలోని కేదారిపురం-ముచ్చింద్ర రోడ్ అధ్వానంగా తయారయ్యాయని, వెంటనే మరమ్మతులు చేపట్టాలని జనసేన పార్టీ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ తిప్పన దుర్యోధనరెడ్డి కోరారు. ఈ మేరకు సోమవారం ఎంపిడిఒ రామారావును సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మూడేళ్లుగా ఈ రోడ్ దుస్థితిపై అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేకుండాపోయిందన్నారు. పెద్ద గోతులు ఉండడంతో తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని వివరించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు కోవాలని కోరారు. కార్యక్రమంలో సాడి శంకరరెడ్డి, మాధవరెడ్డి పాల్గొన్నారు.

ఎండలోనే యాత్రికులు

ప్రజాశక్తి- జలుమూరు

శ్రీముఖలింగంలోని శ్రీముఖలింగేశ్వరుని ఆలయానికి కనుమ సందర్భంగా సోమవారం యాత్రికులు పోటెత్తారు. ఉదయం నుంచే అధిక సంఖ్యలో చుట్టుపక్కల గ్రామస్తులే కాక ఇతర ప్రాంతాల నుంచీ అధిక సంఖ్యలో తరలివచ్చి శ్రీముఖలింగేశ్వరుని దర్శనం చేసుకున్నారు. దర్శనానికి వచ్చిన యాత్రికులకు మౌలిక వసతులు కల్పించడంలో దేవదాయశాఖ విఫలమైందని యాత్రికులు ఆరోపించారు. దర్శనానికి వచ్చిన యాత్రికులకు తాగునీరు, నీడ సౌకర్యం కల్పించకపోవడంతో పలువురు విమర్శిస్తున్నారు.

ఎండలోనే పడిగాపులు కాస్తున్న యాత్రికులు

ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరి

అవగాహన కల్పిస్తున్న కుమార్, మోహనరావు

పలాస : మండలంలోని లక్ష్మీపురం టోల్ ప్లాజా వద్ద ప్రాజెక్టు మేనేజర్లు సింథిల్ కుమార్, మోహనరావు ఆధ్వర్యాన జాతీయ రహదారి భద్రతా వారోత్సవాలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జెండా ఆవిష్కరణ, భద్రతా ప్రతిజ్ఞ, రహదారుల భద్రతపై వాహనదారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోడ్డుపై వాహనాలు నడిపేటప్పుడు నిబంధనలు పాటించాలన్నారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెంట్ తప్పనిసరిగా పెట్టుకోవాలన్నారు. కార్లు నడిపించే వాహనదారులు సీట్‌బెల్ట్ పెట్టుకోవాలని సూచించారు. మద్యం తాగి వాహనాలు నడపడం వల్ల ఎక్కువగా ప్రమాదాలు సంభవిస్తున్నాయని, అందుకు మద్యం తాగి వాహనం నడపరాదని అన్నారు. కార్యక్రమంలో టోల్ మేనేజర్ శేఖర్ రాథోడ్, ఐఎంటి మేనేజర్ ధనరాజ్, సిబ్బంది పాల్గొన్నారు.

అండమాన్‌లో ముగ్గుల పోటీలు

పలాస: అండమాన్‌లో బొడ్డపాడు జగదీశ్వర సంఘం, అండమాన్ తెలుగుదేశం పార్టీ పోర్ట్ బ్లయిర్ మున్సిపాలిటీలో 1వ వార్డు కౌన్సిలర్ సాహుల్ హమీద్ ఆధ్వర్యాన సంక్రాంతి సంబరాల్లో భాగంగా ముగ్గులు పోటీలు నిర్వహించారు. గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. సంఘం అధ్యక్షులు బొడ్డు కాంతారావు, ప్రధాన కార్యదర్శి బైనపల్లి సుందరయ్య, పోతనపల్లి కూర్మారావు, బొడ్డు కృష్ణారావు పాల్గొన్నారు.

ముగ్గులు వేస్తున్న మహిళలు